దిష్టిబొమ్మతో రోడ్డుపై బైఠాయించిన ఏబీవీపీ నాయకులు

యూనివర్సిటీలకు వీసీలను నియమించండి

- ఓయూలో ఏబీవీపీ ఆందోళన
- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 2: ఉస్మానియా యూనివర్సిటీలో మరోసారి ఉద్రిక్తత తలెత్తింది. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వీసీలను నియమించాలని, సమస్యలు పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన ఆందోళన పోలీసులకు విద్యార్థులకు మధ్య బాహాబాహీకి దారితీసింది. వర్సిటీలపై వివక్షకు నిరసనగా భారీ ర్యాలీ నిర్వహించి, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మతో రోడ్డుపై రాస్తారోకో చేపట్టారు. అనంతరం, దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకునేందుకు విఫలయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, విద్యార్థులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల వీసీల పదవీ కాలం ముగిసి దాదాపు మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు వీసీలను నియమించకపోవడం సిగ్గుచేటన్నారు. ఇన్‌చార్జి వీసీలతో కాలయాపన చేస్తూ వర్సిటీల మనుగడకే ముప్పు తీసుకువస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్రంలోని వర్సిటీలకు మహర్దశ తీసుకువస్తామని అన్నట్టు గుర్తు చేశారు. కానీ, ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటి వరకు వర్సిటీల సంక్షేమం గురించి మాట్లాడిన పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించడంతో విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోందన్నారు. వర్సిటీలలో ఖాళీగా ఉన్న 82 శాతం టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అన్యాక్రాంతమవుతున్న వర్సిటీ భూములను కాపాడాలని కోరారు. అశాస్త్రీయంగా పెంచిన పీజీ, ఇంజినీరింగ్, పీహెచ్‌డీ ట్యూషన్, ఎగ్జామ్ ఫీజులను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. వర్సిటీలో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి మెరుగైన హాస్టల్ వసతి కల్పించాలన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, విద్యానగర్ విభాగ్ కన్వీనర్ పృథ్వీతేజ, స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ కన్వీనర్ జీవన్, స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు శ్రీహరి, కమల్ సురేశ్, నాయకులు సుమన్ శంకర్, రాజు పాల్గొన్నారు.

అవయవ దాతల ఔదార్యం ప్రశంసనీయం

- జీవన్‌దాన్ ఆధ్వర్యంలో 143 మంది దాతల కుటుంబాలకు సత్కారం

దాతల కుటుంబ సభ్యులకు ప్రశంసా పత్రాలను అందజేసిన డీఎంఈ డాక్టర్ వాణి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పలు

బన్సీలాల్‌పేట్, ఆగస్టు 2: బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల అవయవాలను దానం చేయడం ద్వారా మరికొందరికి పునర్జన్మ ఇవ్వవచ్చని, అలాంటి దాతల ఔదార్యాన్ని వారి కుటుంబ సభ్యుల సామాజిక స్పృహను, పెద్ద మనస్సును అభినందిస్తున్నామని జీవన్‌దాన్ చైర్ పర్సన్, డీఎంఈ డాక్టర్ ఎన్.వాణి అన్నారు. జాతీయ అవయవ దాన దినాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్‌లోని గాంధీ వైద్య కళాశాల ఆడిటోరియంలో జీవన్‌దాన్ ఆధ్వర్యంలో కాడవర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా 143 మంది దాతల కుటుంబాలను శుక్రవారం సత్కరించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. జీవన్‌దాన్ కో–చైర్మన్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, జీవన్‌దాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణలత, గాంధీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ఇందిర, గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్‌ఎన్ రాజ కుమారి, గాంధీ నెఫ్రాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ మంజుషలు అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2010 నుంచి బ్రెయిన్ డెడ్ కారణంగా చనిపోయిన వ్యక్తుల అవయవాలను జీవన్‌దాన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి దానం చేయడం జరుగుతున్నదన్నారు. నిమ్స్, ఉస్మానియా, గాంధీ దవాఖానలలో జీవన్‌దాన్ ద్వారా 2022 జూలై నుంచి 2023 మార్చి వరకు బ్రెయిన్ డెడ్ అయిన 1,465 దాతల నుంచి సేకరించిన 5,541 అవయవాలను ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసి అనేక మందికి పునర్జన్మను అందించగలిగామని అన్నారు. అలాగే, 2024లో ఇప్పటివరకు 103 మంది బ్రెయిన్ డెడ్ అయిన దాతల నుంచి అవయవాలను సేకరించామని, రిజిస్టర్ చేసుకున్న వారికి వరుస క్రమంలో అవయవ మార్పిడి చేయడం కొనసాగుతున్నదని తెలిపారు. ఈ ఉత్తమ సేవలకు గాను తెలంగాణ జీవన్‌దాన్ నాలుగు జాతీయ స్థాయి అవార్డులకు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యులు కన్నీరు పెట్టుకున్నారు. తమ వారి సామాజిక సేవను గుర్తించి ఇక్కడకు పిలిచి సత్కరించడం కొంత సంతృప్తి కలిగించిందని దాతల కుటుంబ సభ్యులన్నారు.

జీహెచ్‌ఎంసీ సీసీపీగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్ నుంచి జీహెచ్‌ఎంసీ సీసీపీ బాధ్యతలు తీసుకున్న కె.శ్రీనివాస్

సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ (సీసీపీ)గా శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గత నెల 31వ తేదీన టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి ఇద్దరు డైరెక్టర్లకు స్థానచలనం కల్పించగా.., అందులో జీహెచ్‌ఎంసీ సీసీపీగా ఉన్న రాజేంద్ర ప్రసాద్ నాయక్‌ను హెచ్‌ఎండీఏ ప్లానింగ్ డైరెక్టర్–2గా, ఈ స్థానంలో ఉన్న శ్రీనివాస్‌ను జీహెచ్‌ఎంసీ సీసీపీగా మార్పు చేస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్ ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే జీహెచ్‌ఎంసీ సీసీపీ బాధ్యతల నుంచి రాజేంద్ర ప్రసాద్ ఉపశమనం పొందగా, రాజేంద్ర ప్రసాద్ నాయక్‌ను ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీసీపీ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీసీపీలు గంగాధర్, ప్రదీప్, టౌన్‌ప్లానింగ్ అధికారులు శ్రీనివాస్, ఇతరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు.. రాజకీయ కుట్రలో భాగమే..

సమావేశంలో మాట్లాడుతున్న పబ్బతి శ్రీకృష్ణ

హిమాయత్‌నగర్, ఆగస్టు2: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజకీయ కుట్రలో భాగమేనని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ ఆరోపించారు. 2004 నవంబర్ 5న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిగణనలోకి తీసుకోకుండా వర్గీకరణ అంశాన్ని రాష్ట్రాలకే అప్పగించడం సరైన విధానం కాదన్నారు. హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీని ఎత్తివేసేలా పాలకులు ప్రయత్నిస్తే కుల, ప్రజా సంఘాలు చేసిన ఆందోళనల వల్ల వెనక్కి తగ్గడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అన్ని కులాలను లెక్కించి వారిలో ఏయే కులాలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారో గుర్తించకుండా వర్గీకరణ చేయడమంటే ప్రభుత్వాలకు కనీసం రిజర్వేషన్లపై అవగాహన లేదనిపిస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించడం అత్యంత దుర్మార్గమన్నారు. మాలలను సంఘటితం చేసి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బలమైన ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాల మహానాడు రాష్ట్ర నాయకులు ఎ.సుధాకర్, ఎల్.శ్రీగిరి, ఎస్.కుమార్, వి.రవి, ఆర్.వర్మ, సంతోష్ పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేద్దాం

- బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న 'స్వచ్ఛదనం- పచ్చదనం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బల్దియా కమిషనర్ ఆమ్రపాలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ నిర్వహణపై కమిషనర్ శుక్రవారం జోనల్ కమిషనర్లు, అడిషనల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పారిశుధ్యం, పచ్చదనాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం 'స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు అన్ని విభాగాల అధికారులతో కలిసి బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ బృందాలు క్షేత్రస్థాయిలో షెడ్యూల్ మేరకు కార్యక్రమాలు సక్రమంగా అమలయ్యేలా కృషి చేయాలని కమిషనర్ పేర్కొన్నారు. ఇందులోభాగంగానే ప్రజలకు ఉపయోగకరమైన మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేయాలని సూచించారు. ప్రభుత్వం ఒక్కో రోజు ఒక్కో వినూత్న కార్యక్రమాన్ని నిర్దేశించిన నేపథ్యంలో ఆయా రోజుల్లో సంబంధిత కార్యక్రమాలను నిర్వహించి, సాయంత్రం 4 గంటల్లోపు నివేదిక సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు.

అంతర్గత బదిలీలకు ప్రత్యేక కమిటీ

బల్దియాలో అంతర్గత బదిలీలు అత్యంత పారదర్శకంగా జరిగేలా కమిషనర్ ఆమ్రపాలి పకడ్బందీ చర్యలు తీసుకోనున్నారు. అవినీతి, ఆరోపణలు, సుదీర్ఘకాలం తిష్ట వేసిన ఉద్యోగులు బదిలీ కానున్నారు. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు కమిషనర్ ప్రత్యేక కమిటీని వేశారు. ఇందులో అదనపు కమిషనర్లు సత్యనారాయణ, నళిని పద్మావతి, పంకజ, గీతా రాధిక ఉన్నారు.

క్యాబ్ డ్రైవర్ల ఆందోళన

ఇతర రాష్ట్రాల వాహనాలపై చర్యలేవి?

నిబంధనలు అతిక్రమించి రాకపోకలు

సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో నాలుగు రోజులుగా క్యాబ్ డ్రైవర్లు ఆందోళన చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇతర రాష్ట్రాల వాహనాలు క్యాబ్ సర్వీస్‌ను అందించడంపై తెలంగాణ డ్రైవర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహన ట్యాక్సీలు చెల్లించి క్యాబ్‌లు నడిపిస్తుంటే, ఎలాంటి పన్నులు చెల్లించకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల వాహనాలు ఇక్కడ వందల సంఖ్యలో తిష్టవేసి తెలంగాణ డ్రైవర్లకు నష్టం చేకూరుస్తున్నారని తెలంగాణ క్యాబ్ అసోసియేషన్ ఫౌండర్ షేక్ సలా ఉద్దీన్ చెప్పారు. పలుమార్లు ఆర్టీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా సరైన డ్రైవ్ చేపట్టడం లేదని విమర్శించారు. కాగా, శుక్రవారం డ్రైవర్ల ఆందోళనపై రవాణా, ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో డ్రైవర్లతో చర్చలు జరిగాయి. రవాణా శాఖకు నష్టం చేకూర్చే ఇతర రాష్ట్రాల వాహనాలపై చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు షేక్ సలా ఉద్దీన్, నగేశ్ కుమార్‌లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇతర రాష్ట్రాల వాహనాలు నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలకు భారీ జరిమానాలు విధించడంతో పాటు సీజ్ చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. మోటార్ వాహన చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇకేబానాతో పారిశ్రామిక ప్రయోజనాలు

- ముగిసిన మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు

సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఇకెబానా కళతో పారిశ్రామిక ప్రయోజనాలు ఉన్నాయని, సృజనాత్మకతను పెంచడంతో పాటు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు అవకాశం ఉందని ఓహారా స్కూల్ ఆఫ్ ఇకెబానా జపాన్ హెడ్ మాస్టర్ లేమోటో హీరోకి ఓహారా అన్నారు. ఓహారా స్కూల్ ఆఫ్ ఇకెబానా హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సును మూడు రోజుల పాటు పార్కు హోటల్‌లో నిర్వహించారు. శుక్రవారంతో సదస్సు ముగియగా, ఔత్సాహికులకు ఇకెబానా కళపై అవగాహన కల్పించారు. దేశంలో ఉన్న 20కి పైగా ఉన్న ఇకెబానా చాప్టర్ల నుంచి ప్రతినిధులతో పాటు జపాన్, యూకే, యూఎస్ వంటి దేశాలకు చెందిన ప్రతినిధులు కూడా హాజరైనట్లుగా నిర్వాహకులు తెలిపారు. ఈ సదస్సుతో కొత్తగా ఇకెబానా నేర్చుకునేవారికి, ఇప్పటికే అనుభవం పొందిన వారికి మెళకువలు పెంపొందించుకునే అవకాశం ఏర్పడిందని హెడ్ మాస్టర్ లేమోటో అన్నారు. జపాన్ కాన్సులేట్ జనరల్ తమ సదస్సును ప్రారంభించారని హైదరాబాద్ చాప్టర్ వర్గాలు పేర్కొన్నాయి. మొక్కలు, పువ్వులు, కొమ్మలను ఉపయోగించి ప్రాచీన కాలం నాటి నైపుణ్యాలతో అందమైన కళాకృతులను నిర్మించడంపై అవగాహన కల్పించారు హైదరాబాద్ చాప్టర్ చైర్ పర్సన్ రేఖారెడ్డి, ప్రెసిడెంట్ నిర్మలా అగర్వాల్, సెక్రటరీ ఇందుమతి. హైదరాబాద్ కేంద్రంగా 70కి పైగా ఇకెబానా ఆర్టిస్టులు ఉన్నారని వైవిధ్యమైన, ఆధునిక హంగులతో అందమైన కళాకృతులను తీర్చిదిద్దడంలో ప్రావీణ్యం పొందారన్నారు. కార్యక్రమంలో సభ్యులు శారద అక్కినేని, నందారావు, నీరజ గొడవర్తి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కృషితో ఎస్సీ వర్గీకరణ సఫలం

అంబేద్కర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, ఆగస్టు 2: ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బీఆర్ఎస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గ్యాని ఆధ్వర్యంలో శుక్రవారం అడిక్‌మెట్ డివిజన్ వీఎస్‌టీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై అంబేద్కర్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, వర్గీకరణకు బీఆర్ఎస్ ఎంతో కృషి చేసిందన్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేశారని తెలిపారు. ఈ తీర్పుతో వెనుకబడిన కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగులు, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సాయిలు, కిశోర్, ఎ.శ్రీనివాస్, రామస్వామి, ధర్మా, హరీశ్, నేత శ్రీను, అస్లం, అబ్బు, సురేందర్, రవి యాదవ్, నాని పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తతో ఉండాలి

- జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ చీఫ్ డాక్టర్ రాంబాబు

సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): దోమల నివారణ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫ్రైడే – డ్రైడే కార్యక్రమంలో చేయాల్సిన వాటిపై పలు పాఠశాలల్లో వాలంటీర్లు విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు తెలిపారు. సీజనల్ వ్యాధులు డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వ్యాధులు ప్రబలడానికి గల కారణాలను, నీళ్లు నిల్వ ఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, నీటి డ్రమ్ములలో నీటిని ఖాళీ చేసి శుభ్రం చేసి అరబెట్టి తిరిగి కొత్త నీళ్లు పట్టుకోవాలని, కొబ్బరి బొండాలలో, టైర్లు, కుండీలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఇంటి చుట్టు పక్కల గుంతలను పూడ్చివేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యార్థి, వలంటీర్లతో పాటు ఎంటమాలజీ, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు జీవ వైవిధ్య పరిశోధనలు

సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో జీవవైవిధ్య పరిశోధనలు కీలకమని నిపుణులు అభిప్రాయపడ్డారు. జీవ, జలావరణాల్లో జీవ వైవిధ్యాన్ని పెంపొందించడంపై ప్రత్యేకంగా కృషి చేయాలన్నారు. ఐసీఎఫ్‌ఆర్‌ఈ – ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ బయోడైవర్సిటీ, ఐసీఎఫ్‌ఆర్‌ఈ– ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెస్ట్ ప్రొడక్టవిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్ వేదికగా నిర్వహించిన సదస్సులో సుస్థిర జీవ వైవిధ్య నిర్వహణ విధానాలు, వాతావరణ మార్పులు, జీవ వైవిధ్య పరిరక్షణ, సుస్థిర వినియోగంతో అటవీ జీవ వైవిధ్యం అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేలా జీవ వైవిధ్య పరిశోధనలతో సాధ్యమని నిపుణులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఐఎఫ్‌ఎస్ అధికారులు ఎల్యూసింగ్ మేరు, వెంకట్ రెడ్డి, ఐసీఎఫ్‌ఆర్‌ఈ–ఐఎఫ్‌బీ హైదరాబాద్ డైరెక్టర్. డా. రాజేశ్వర రావు, సీఆర్‌ఐడీఏ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ సుధాకర్ రెడ్డి, ఎన్‌ఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డా. పద్మజ, హైదరాబాద్ యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు. వీరితో పాటు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన అటవీ, జీవ వైవిధ్య బోర్డులకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

నాణ్యమైన విద్యతోనే ఉత్పాదకత పెరుగుదల

- యూజీసీ చైర్మన్ ప్రొ. ఎం.జగదీశ్ కుమార్

'ఎంపవర్ తెలంగాణ ఎడ్యుకేషన్ సిస్టమ్' నివేదికను విడుదల చేసిన దేవసేన, జగదీశ్

అమీర్‌పేట్, ఆగస్టు 2: నాణ్యమైన విద్యతోనే ఉత్పాదకత పెరుగుతుందని యూజీసీ చైర్మన్ ప్రొ. ఎం.జగదీశ్ కుమార్ పేర్కొన్నారు. ఫిక్కీ, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ ఉన్నత విద్యా మండలి సంయుక్త ఆధ్వర్యంలో బేగంపేట్‌లోని ఐటీసీ కాకతీయ హోటల్‌లో 'ఎంపవరింగ్ ఎడ్యుకేషన్ ఎకో సిస్టమ్' అనే అంశంపై శుక్రవారం ప్రారంభమైన రెండు రోజుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ ఉన్నత విద్యారంగాన్ని పరిశీలిస్తే 4.3 కోట్ల మంది విద్యార్థుల్లో దాదాపు 94 శాతం మంది 482 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, 487 ప్రభుత్వ నిధులతో నడిచే విశ్వవిద్యాలయాలు, 130 డీమ్డ్ టు ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతున్నారన్నారు. మన విద్యా వ్యవస్థకు పునాదిగా ఉన్న ఉపాధ్యాయులు తమ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాలన్నారు. టెక్నికల్ అండ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్ దేవసేన మాట్లాడుతూ, యువతకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కొత్తగా స్కిల్డ్ యూనివర్సిటీని తీసుకొచ్చిందన్నారు. తెలంగాణ యువతలో నైపుణ్యాంశాలను పెంచే దిశగా పడుతున్న అడుగుల్లో ఇది మరో పెద్ద ముందడుగన్నారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యా రంగాన్ని ఆధునీకరించే దిశగా ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. కంప్యూటర్ ఇంజినీరింగ్‌కు ఏ మాత్రం తగ్గకుండా కోర్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లతో పాటు పాలిటెక్నిక్ కళాశాలల ప్రాముఖ్యతలను పెంచేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. లింబాద్రి, ఐఐటీ హైదరాబాద్ అండ్ రూర్కీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్, చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, పార్ట్‌నర్, ఎడ్యుకేషన్ సెక్టార్ లీడర్ సుచీంద్ర కుమార్, ఫిక్కీ తెలంగాణ ఎడ్యుకేషన్ కమిటీ చైర్మన్ ప్రొ. సుధాకర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిక్కీ, పీడబ్ల్యూసీ సంస్థలు సంయుక్తంగా 'ఎంపవర్ తెలంగాణ ఎడ్యుకేషన్ సిస్టమ్' నివేదికను విడుదల చేశాయి.

కూకట్‌పల్లి సమస్యలను పరిష్కరించండి

- ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే కృష్ణారావు వినతి
- కూకట్‌పల్లి వై జంక్షన్‌లో అండర్ పాస్.. ఫ్లైఓవర్లు నిర్మించాలి
- డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులకు కేటాయించాలి
- భరత్‌నగర్ కూరగాయల మార్కెట్‌కు ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 2: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డిని శుక్రవారం కలిసిన ఎమ్మెల్యే కృష్ణారావు పలు సమస్యలకు గాను పరిష్కారం కోరుతూ వినతిపత్రాలను అందించారు. కూకట్‌పల్లి అంబేద్కర్ వై జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించేందుకు.. కూకట్‌పల్లి నుంచి ఎర్రగడ్డ మార్గంలో ఫ్లైఓవర్‌ను, బాలానగర్ నుంచి కూకట్‌పల్లి మార్గంలో అండర్ పాస్ బ్రిడ్జీలను నిర్మించాలని కోరారు. ఇక్కడ అండర్ పాస్, ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కోసం ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, ఈ పనులు చేసేందుకు అనుమతులతో పాటు నిధులు కేటాయించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇండ్లలో కూకట్‌పల్లి నియోజకవర్గానికి 4,300 కేటాయించారని, వాటిలో కొన్నింటిని అర్హులకు పంపిణీ చేయడం జరిగిందని, మిగిలిన ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. ఆలస్యమైతే డబుల్ బెడ్‌రూం ఇండ్లు శిథిలావస్థకు చేరుకునే అవకాశం ఉందన్నారు. భరత్‌నగర్ కూరగాయల మార్కెట్‌లో 74 మంది కమిషన్ ఏజెంట్లు, రైతులు మెట్రో రైల్ వంతెన కింద కూరగాయలు అమ్ముకుంటూ జీవిస్తున్నారని, ఈ మార్కెట్‌లో నిత్యం ట్రాఫిక్ సమస్యలతో రైతులు, వినియోగదారులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించడానికి భరత్‌నగర్ కూరగాయల మార్కెట్ కోసం ఐదెకరాల హౌసింగ్ బోర్డు స్థలాన్ని లీజు పద్ధతిలో కేటాయించాలని కోరారు. ఫతేనగర్ నుంచి సనత్‌నగర్ వెళ్లే మార్గంలో రైల్వే బ్రిడ్జీ విస్తరణ, రైల్వే అండర్ పాస్ బ్రిడ్జీ నిర్మాణ పనులను శంకుస్థాపన చేయడం జరిగిందని, ఈ పనులను వేగవంతంగా పూర్తిచేస్తే, ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయన్నారు. బాలానగర్ ఫేజ్–1 కో ఆపరేటివ్ ఎస్టేట్‌కు చెందిన 47 ఎకరాల ప్రభుత్వ స్థలానికి సంబంధించిన 51 ఏండ్ల లీజు గడువు ముగిసిందని, ఈ ప్రభుత్వ స్థలంలో ఎలాంటి అద్దెలు చెల్లించకుండా కొందరు అక్రమంగా అద్దెలు వసూలు చేస్తున్నారని, మరి కొందరు ఇతరులకు అమ్ముకుంటున్నారని తెలిపారు. ఈ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, పేదల కోసం వంద పడకల వైద్యశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణం కోసం ఈ స్థలాన్ని ఉపయోగించాలని కోరారు.

తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యం

సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా జాతీయ పోషకాహార సంస్థ మహిళ, శిశు సంక్షేమ సిబ్బందికి, గర్భిణులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డ ఎదుగుదలకు తల్లి పాల ప్రాధాన్యతను వివరించారు. ఎన్నో పోషకాలు, ఎంతో శ్రేష్టమైన తల్లిపాలను పుట్టిన బిడ్డకు నిర్ణీత వయసు వచ్చే వరకు అందించేలా అంగన్‌వాడీలు చూడాలన్నారు. అదే విధంగా పాలిచ్చే తల్లులు మంచి ఆహారాన్ని తీసుకున్నప్పుడే బిడ్డ రోగ నిరోధకత పెరిగి ఎదుగుదల వేగంగా ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే అంగన్‌వాడీలకు గర్భిణులకు అందించాల్సిన సూచనలపై అవగాహన కల్పించారు. గర్భిణులను ప్రోత్సహించి, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించేలా కృషి చేయాలని సిబ్బందికి ఎన్ఐఎన్ సిబ్బంది సూచించారు. కేంద్ర ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో యాదాద్రి జిల్లాలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.

లేహ్‌లో తొలి జియోథర్మల్ ప్లాంట్

- ఎన్జీఆర్ఐ సహకారంతో ఓఎన్‌జీసీ పనులు ప్రారంభం

సిటీబ్యూరో, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): దేశంలోనే తొలి జియోథర్మల్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఓఎన్‌జీసీ, హిమాలయన్ పునరుత్పాదక ఇంధన వనరుల సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన జాయింట్ వెంచర్‌కు ఎన్‌జీఆర్ఐ చేసిన భౌగోళిక అధ్యయనాలు, వాటి ఫలితాల ఆధారంగా జియోథర్మల్ ఇంధన వనరులను అన్వేషించనున్నారు. పైలట్ ప్రాజెక్టుగా ఒక మెగావాట్ శక్తి సామర్థ్యంతో కూడిన జియోథర్మల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తుండగా, హిమాలయాల అడుగు భాగంలో కిలోమీటర్ దూరంలో సుమారు 200 డిగ్రీ సెల్సీయస్‌తో కూడిన ఉష్ణోగ్రతలు ఉన్నట్లుగా ప్రాథమిక సర్వేలో గుర్తించారు. ఈ ఉష్ణోగ్రతలతో ఒక మెగావాట్ శక్తిని ఉత్పత్తి చేయడానికి ఆస్కారం ఉంటుందని ఎన్‌జీఆర్ఐ వర్గాలు పేర్కొన్నాయి. మూడు దశల్లో జరిగే తొలి పైలట్ ప్రాజెక్టుతో ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను స్థానిక అవసరాలకు ఉచితంగా సరఫరా చేయనున్నారు. అదే విధంగా మిగిలిన రెండో దశలో వచ్చే ఉత్పత్తిని బట్టి వాణిజ్య అవసరాలకు వినియోగిస్తారని తెలిసింది.

ఫైనాన్షియల్ విస్డమ్‌పై ఇన్వెస్టర్ అవేర్నెస్ ప్రోగ్రామ్

కొండాపూర్, ఆగస్టు 2: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో శుక్రవారం వర్సిటీ, మ్యూచువల్ ఫండ్స్ ఆఫ్ ఇండియా (ఏఎంఎఫ్ఐ)ల సంయుక్త నిర్వహణలో 'ఇన్వెస్టర్ అవేర్నెస్ ప్రోగ్రామ్ ఆన్ ఫైనాన్షియల్ విస్డమ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ నాగేశ్వర్ చలసాని, సీనియర్ కన్సల్టెంట్ సూర్యకాంత్ శర్మలు ముఖ్య అతిథులుగా హాజరై, పెట్టుబడులపై విలువైన సలహాలు, సూచనలను అందించారు. ఉత్తమ పెట్టుబడుల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందుగా తెలుసుకోవాల్సిన ప్రధాన అంశాలను వివరించారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పెట్టుబడులు ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జీవీఆర్‌కే ఆచార్యులు, ప్రొఫెసర్ ఈరాల లోకానంద రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోబోటిక్స్ స్కిల్ లాంచ్


కార్యక్రమంలో ఎంఎల్‌ఆర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి

దుండిగల్, ఆగస్టు 2: ఆల్ ఇండియా రోబోటిక్స్ అసోసియేషన్ (ఏఐఆర్ఏ), తెలంగాణ అకాడెమియా ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టీఏఎస్‌కే) సహకారంతో రోబోటిక్స్ స్కిల్ లాంచ్ ఈవెంట్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని టీ హబ్‌లో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఎల్ హెచ్‌ఓడీ డాక్టర్ కాశీసాయి ప్రసాద్, ఏఐఎంఎల్ రోబోటిక్స్ ఇన్‌చార్జి జె.విజయ్ గోపాల్‌లు పాల్గొన్నారు. అనంతరం, ఎంఎల్‌ఆర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి సంస్థ తరపున రోబోట్‌ను స్వీకరించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే, ఎంఎల్‌ఆర్ఐటీ కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎంఎల్‌ఆర్ఐటీకి చెందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మిషిన్ లెర్నింగ్ (ఏఐఎంఎల్) విభాగాన్ని అభినందించారు. భారతదేశంలో రోబోటిక్స్ విద్యా రంగానికి ఒక మైలురాయి కావడంతో పాటు ఎంఎల్‌ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్‌ఆర్ఐటీ) ఏఐఆర్ఏ నుంచి సెమీ హ్యూమనాయిడ్ రోబోట్ కోసం 6.5 లక్షల ప్రభుత్వ సబ్సిడీని అందుకున్న మొదటి సంస్థగా అవతరించిందని తెలిపారు. 2030 నాటికి ఉమిలియన్ రోబోట్‌లను నిర్మించాలనే ఏఐఆర్ఏ యొక్క ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని ఆయన ప్రశంసించారు. దేశంలో ఆవిష్కరణలు, నైపుణ్యాల అభివృద్ధిని పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.